తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

జిల్లా తూనికలు, కొలతల అధికారి మనోహర్

కొత్తగూడెం అర్బన్, జనవరి 28: వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ స్పష్టం చేశారు. కొత్తగూడెం వారాంతపు సంతలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చికెన్, మటన్, చేపల విక్రయాల తూకాలను పరిశీలించారు. వస్తువు తూకాన్ని వినియోగదారులు నిశితంగా పరిశీలించాలని చెప్పారు. వస్తువును సరైన విధంగా తూకం వేస్తున్నారో లేదో వినియోగదారులు పరిశీలించుకోవాలని సూచించారు. కాగా, కొన్నిచోట్ల తూకం తక్కువ ఉన్నట్లు గమనించిన ఆయన.. వినియోగదారులకు సరైన తూకం వేసి ఇవ్వాలని సూచించారు. అలాగే, వినియోగదారులు తూకాల్లో మోసపోవద్దని, వస్తువు కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలని సూచించారు. వ్యాపారులు ఉపయోగించే తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్సు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులపై ఐదు కేసులు నమోదు చేసి రూ.12 వేలు రుసుము విధించినట్లు చెప్పారు.

నేడు 'ప్రజావాణి': కలెక్టర్

కొత్తగూడెం టౌన్, జనవరి 28: సోమవారం సందర్భంగా ఈ నెల 29న ఐడీవోసీలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, నిర్దేశిత సమయంలోగా హాజరుకావాలని సూచించారు.

రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి: కాసాని ఐలయ్య

ములకలపల్లి, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు రుణాలను మాఫీ చేయాలని, రుణమాఫీ చేసేంతవరకు రైతులు బ్యాంకుల్లో రుణాలు చెల్లించవద్దని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. ఆదివారం ములకలపల్లిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేసిందని, రైతులకు చేయడంలో మాత్రం ప్రభుత్వాలు విఫలమైందని విమర్శించారు.

'మైనార్టీని క్యాబినెట్ మంత్రిగా నియమించాలి'

ఎండీ యాకూబ్‌పాషా

రామవరం, జనవరి 28: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో ముస్లింల నుంచి ఒకరిని మైనార్టీ మంత్రిగా నియమించాలని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం మైనార్టీల నుంచి ఒకరిని మంత్రిగా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మైనార్టీ గురుకులాలు ఇరుకు గదులు, అద్దె భవనాలు అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా కూడా మైనార్టీ గురుకులాలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు కాలేదని అన్నారు.

వృక్షమిత్రలకు ముగిసిన శిక్షణ

అశ్వారావుపేట, జనవరి 28 : కొబ్బరిసాగు, ఫలసాయం సేకరణ వంటి అంశాలపై వృక్షమిత్రలకు మూడురోజులపాటు జరిగిన శిక్షణ ఆదివారం ముగిసింది. కొబ్బరిచెట్లు ఎక్కు విధానంతోపాటు కాయలు సేకరణపై కొబ్బరి విత్తనోత్పత్తి నర్సరీలో ఉద్యానాధికారి కిషోర్ వివరించారు. అక్కడ నుంచి ఉద్యాన పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ కొబ్బరిసాగు, మొక్కల ఉత్పత్తి, తోటల యాజమాన్య పద్ధతులను తెలిపారు. తోటల సాగు పట్ల అవగాహన ఉంటే దిగుబడుల సేకరణ సులభమవుతుందని, వృక్షమిత్రలు తోటల యాజమాన్యంపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వారివెంట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ కె.శిరీష ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

టేకులపల్లి, జనవరి 28 : ఏకలవ్య గురుకుల మోడల్ స్కూల్ సొసైటీ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలో బంగారుపతకం సాధించిన తేజస్వినిని ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. ఆదివారం టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామపంచాయతీ పరిధి జేత్యతండా గ్రామానికి చెందిన పాడ్య సైదులు, విజయ దంపతుల కుమార్తె తేజస్విని పాల్వంచ ఏకలవ్య గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. తేజస్విని రాష్ట్రస్థాయిలో జరిగిన విలువిద్య పోటీలో బంగారుపతకం సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం సర్పంచ్ భూక్యా గంగాబాయి ఆధ్వర్యంలో బాలికను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

టేకులపల్లి, జనవరి 28 : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) టేకులపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రతాప్ సమక్షంలో ఆదివారం జరిగింది. టేకులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా కాళ్ళ రంజిత్, ఉపాధ్యక్షుడిగా పూన్నెం రాకేష్‌దొర, కార్యదర్శిగా సరికొండ వెంకటేష్, సభ్యులుగా కుక్కముడి ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్తదాతకు అవార్డు

భద్రాచలం, జనవరి 28: పట్టణానికి చెందిన కొప్పుల మురళి, గత 18 ఏళ్లలో 51 సార్లకు పైగా రక్తదానం చేశారు. అతని సేవలను ఏపీలోని విశాఖ పట్నానికి చెందిన తాసుబెల్లి ఫౌండేషన్ గుర్తించింది. విశాఖలో ఆదివారం ఫౌండేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగాయి. ఈ వేదికపై, మురళికి విశిష్ట భారత సేవారత్న అవార్డును నిర్వాహకులు అందజేసి సత్కరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఉద్యోగ అవకాశాలు

★ మా సంస్థ నందు JOB చేయుటకు, 10th, Inter, డిగ్రీ ఆపై చదివే స్థోమత లేని నిరుద్యోగ యువతీయువకులు కావలెను. Age:18-24లోపు ముఖ్యగమనిక నో ఫీ, రూం ఫ్రీ, సంప్ర॥8143293596.
NLG-310749

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మామిడి పూత లేక వెత

- వచ్చిన పూత కూడా పురుగు పుట్రా పాలు
- రూ.వేలు ఖర్చు పెట్టి మందుల వినియోగం
- ఆశాజనకంగా లేని పరిస్థితులు.. ఆందోళనలో రైతులు

మామిడి తోటలో మందు పిచికారీ చేస్తున్న కూలీలు

చండ్రుగొండ, జనవరి 28: మామిడి చెట్లకు పూత రావడం మరింత ఆలస్యమవుతున్నది. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లోనే పూత మస్తుగా వస్తుంది. కానీ ఈ ఏడాది జనవరి నెలాఖరు వచ్చినా పూత ఆశాజనకంగా కనిపించడం లేదు. ఈ విషయమై ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 12 వేల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 45 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో ఎక్కువగా అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చండ్రుగొండ, దమ్మపేట, ములకలపల్లి, భద్రాచలం, చర్ల, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, అశ్వాపురం, పాల్వంచ, సుజాతనగర్, బూర్గంపహాడ్, కరకగూడెం మండలాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడి రైతులు బంగినపల్లి, కేసరి, తోతాపురి, హిమాయత్, చిన్న, పెద్ద రసాలు వంటి రకాల తోటలు పెంచుతున్నారు. గతేడాది కూడా మామిడి రైతులు నష్టాలు చవి చూశారు. గత సీజన్ నష్టాలను పూడ్చుకుందామని, అలాగే లాభాలను ఆర్జిద్దామనుకున్న రైతులకు నష్టాలే ఎదురయ్యే పరిస్థితి నెలకొన్నది.

రైతుల పాట్లు..

మామిడి తోటల్లో ప్రస్తుతం అరకొరగా పూత వచ్చింది. వచ్చిన పూతను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఎకరానికి సుమారు రూ.40 వేలు వెచ్చించి మూడు దఫాలుగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పూత వచ్చేందుకు, ఆపేందుకు ప్లానోఫిక్స్, క్లోరి పైరిఫాస్ వంటి మందులు, దోమల నివారణకు ఇమడా, బూజు రాకుండా సాప్ పొడి వాడుతున్నారు. అయినప్పటికీ పూతను రసం పీల్చే పురుగులు ఆశిస్తున్నాయంటూ వాపోతున్నారు. అనుకున్న సమయానికి పూత వస్తే ఎకరానికి ఐదు టన్నుల దిగుబడి లభిస్తుందని రైతులు అంచనా వేశారు. కానీ ఈ ఏడాది టన్ను దిగుబడైనా వచ్చే పరిస్థితి లేదంటున్నారు.

పత్తాలేని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు..

సస్యరక్షణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలివ్వాల్సిన ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలోకి రావడం లేదని, వారి నుంచి తమకు ఎలాంటి సాయం అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి మామిడి తోటల సంరక్షణపై అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు.

పామాయిల్ రైతు సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

అశ్వారావుపేట, జనవరి 28 : ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆయిల్‌పాం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ పామాయిల్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సొసైటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలలో గెలల క్రషింగ్, ఓఈఆర్ పరీక్షించే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, రైతులకు శిక్షణ, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సాగుకు అవసరమైన పరికరాలను రాయితీపై అందించాలని, పోడుభూములకు సాగునీటి, డ్రిప్ వసతులు కల్పించాలని కోరారు. 2019 నుంచి ఇచ్చిన పామాయిల్ మొక్కల రాయితీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

అశ్వారావుపేట/ అశ్వారావుపేట రూరల్, జనవరి 28 : శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం విద్యార్థులు అశ్వారావుపేట మండలంలో మూడురోజుల పర్యటన ఆదివారం ముగిసింది. మండల పరిధిలో పర్యటించి ఆయిల్‌పాం, కొబ్బరి, కోకో, జామ, మామిడి, అరటి తోటలతోపాటు కూరగాయల పంటలను అధ్యయనం చేశారు. పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల సాగు, పెట్టుబడి, దిగుబడులు, ఆదాయం వంటి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఉద్యాన పరిశోధనా కేంద్రంలో పర్యటించారు. హెచ్‌ఆర్‌ఎస్‌లో ఉద్యాన, కూరగాయల నర్సరీ, పరిశోధన వివరాలను శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ విద్యార్థులకు వివరించారు. ఉద్యాన మొక్కల అంటుగట్టే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం పామాయిల్ ఫ్యాక్టరీ, నర్సరీ, కొబ్బరి నర్సరీలను సందర్శించారు. పామాయిల్ ఫ్యాక్టరీలో క్రషింగ్ విధానం, ఆయిల్ రికవరీ, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలను ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ వివరించారు. వారివెంట ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్, టి.మమత, ఏఈవో శ్రీకాంత్ ఉన్నారు.

'టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు ప్రత్యేక కార్యాచరణ'

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 28: పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నట్లు హెచ్‌ఎం డాక్టర్ దయాళ్ తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై రామవరం హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభిరుచి మేరకు వారి ఉన్నత విద్యాభ్యాసం గురించి మార్గదర్శకం చేస్తున్నామని, సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నామని, ప్రతి రోజూ ప్రత్యేక స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను 1:2 నిష్పత్తిలో దత్తత తీసుకొని ప్రత్యేకంగా చదివిస్తున్నారని అన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

చండ్రుగొండ, జనవరి 28 : తెలంగాణ ఉద్యమకారుల్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం చండ్రుగొండ పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గాదె లింగయ్య, ఎస్కే జాఫర్, రమేశ్, సైదయ్య, శ్రీరామ్, చల్లపల్లి రాజా, అర్జున, తేజావత్ భీముడు, పోట్రు వెంకటేశ్వర్లు, సుంకర రామారావు, కృష్ణ, శ్రీనివాసరావు, ముస్తాఫా, యాకయ్య పాల్గొన్నారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం, జనవరి 28: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదివారం 108 బంగారు పుష్పాలతో అర్చన చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

భద్రాచలంలో అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు

భద్రాచలం, జనవరి 28: వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తాళ్లూరి భారతీదేవి జ్ఞాపకార్థం అంతర్రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు భద్రాద్రి కళాభారతి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం భద్రాచలంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే ఈ నాటకోత్సవాలను తలపెట్టినట్లు చెప్పారు. కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, తాళ్లపూడి రాము, రామారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న 'బెస్ట్ టీచర్స్' సమావేశం

భద్రాచలం, జనవరి 28: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సమావేశాన్ని వచ్చే నెల 11న భద్రాచలంలో నిర్వహించనున్నట్లు అవార్డీ టీచర్స్ అసోసియేషన్ (ఆటా) అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆటా నూతన కార్యవర్గాన్ని ఈ సమావేశం ఎన్నుకుంటుందని పేర్కొన్నారు.

ఆవిష్కరణల వేదికగా ఐఎస్ఎఫ్

భద్రాచలం, జనవరి 28: ఆవిష్కరణలకు వేదికగా ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) నిలుస్తున్నదని దాని వ్యవస్థాపకుడు జేపీ చౌదరి అన్నారు. పట్టణంలో ఫౌండేషన్ సమావేశం శని, ఆదివారాల్లో జరిగింది. ఆదివారం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని అన్నారు. వీటిని ప్రోత్సహించే లక్ష్యంతోనే తమ ఫౌండేషన్ ఏర్పడిందని చెప్పారు. ఇప్పటికే కొంతమంది ఆవిష్కర్తలకు తోడ్పాటు అందించామన్నారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత

దమ్మపేట రూరల్, జనవరి 28 : అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి పట్టుకుని ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారం శివారులోని చెరువు నుంచి దమ్మపేటకు నాలుగు ట్రాక్టర్లు మట్టిని తోలుతున్నాయి. వీటికి అనుమతులు లేకపోవడంతో ఎస్ఐ దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ములకలపల్లి, జనవరి 28 : మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో రైతువేదిక వద్ద ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని, కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి విజయనర్సింగ్‌హోం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సునీత ప్రారంభించగా వైద్యురాలు విజయలక్ష్మి, శంకర్‌రావు, రూప గ్రామస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

సీఎంవోఏఐ ఎన్నికలు ప్రశాంతం

సింగరేణి వ్యాప్తంగా 88.25 శాతం పోలింగ్ నమోదు

ఓటుహక్కును వినియోగించుకుంటున్న ఏరియా జీఎం

కొత్తగూడెం సింగరేణి/ రామవరం, జనవరి 28: సింగరేణిలో కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సంస్థ వ్యాప్తంగా 2,161 ఓట్లకు గాను 1,907 మంది అధికారులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు పూర్తికాగానే ఏరియాల వారీగా రాత్రి ఏడు గంటల నుంచి కౌంటింగ్‌ను ప్రారంభించారు. ఈ ఎన్నికల ఫలితాలు ఆదివారం అర్ధరాత్రి వరకు వెలువడే అవకాశాలు ఉన్నాయి. 88.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

కొత్తగూడెం ఏరియాలో..

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ఆర్‌సీవోఏ క్లబ్‌లో, సత్తుపల్లిలోని ఎగ్జిక్యూటివ్‌లకు జేవీఆర్‌వోసీ ఆఫీసర్స్ క్లబ్‌లో సీఎంవోఏఐ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించినట్లు ఏరియా జీఎం శాలెంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో 92 ఓట్లకు గాను 85 ఓట్లు, సత్తుపల్లిలో 76 ఓట్లకు గాను 75 ఓట్లు కలిపి మొత్తంగా ఏరియాలో 168 ఓట్లకు గాను 160 ఓట్లు పోలైనట్లు వివరించారు. అనంతరం ఆయన కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

పాల్వంచ రూరల్, జనవరి 28: పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలో కూడా డిగ్రీ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాల్వంచ డిగ్రీ కళాశాలలో 1990-91లో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులకు కృతజ్ఞులు తెలుపుకుంటూ వారిని ఘనంగా సన్మానించారు. కళాశాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని పూర్వ విద్యార్థుల సంఘ నాయకుడు పసునూరి రమేశ్ తెలిపారు.

గట్టాయిగూడెం పాఠశాలలో..

పాల్వంచ గట్టాయిగూడెం పాఠశాలలో 1997-98 సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ కలుసుకొని ఆత్మీయంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థులు

నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రధాని 'పరీక్షా పే చర్చ'కు సుమశ్రీ

ప్రధానమంత్రి చర్చా కార్యక్రమానికి ఎంపికైన సుమశ్రీ

గుండాల, జనవరి 28: ప్రధాని నరేంద్రమోదీతో జరిగే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి గుండాల ఏకలవ్య మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని వట్టం సుమశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.సంధ్యారాణి ఆదివారం తెలిపారు. ఈ చర్చా కార్యక్రమానికి రాష్ట్రంలో మొత్తం 10 మందిని ఎంపిక చేయగా, తమ మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. సుమశ్రీని ఈఎంఆర్ఎస్ సెక్రటరీ నవీన్ నికోలస్, డిప్యూటీ సెక్రటరీ చంద్రశేఖర్ రజిత, స్కూల్ సిబ్బంది అభినందించారు.

42 కిలోల గంజాయి పట్టివేత

మణుగూరుటౌన్, జనవరి 28: అక్రమంగా తరలిస్తున్న 42 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఖమ్మం), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్(మణుగూరు) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని సమ్మక్క-సారలమ్మ ఆలయం వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న కారును ఆపి తనిఖీ చేయగా 42 కేజీల ఎండు గంజాయిని గుర్తించి పట్టుకున్నాట్లు తెలిపారు. కారును సీజ్ చేస్తున్నామని తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్ కరీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, జనవరి 28 : మండల పరిధిలోని బచ్చువారిగూడెం గ్రామానికి చెందిన టీ ప్రమీల(25) శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళ్తే.. వేలేరుపాడు మండలంలోని శివకాశిపురం గ్రామానికి చెందిన ప్రమీల, అశ్వారావుపేట మండలంలోని బచ్చువారిగూడెం గ్రామానికి చెందిన తెల్లం హరిబాబు అలియాస్ బాలరాజు నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి మూడేండ్ల బాబు ఉన్నాడు. గత మూడ్రోజుల క్రితం భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్ హుక్‌కు చీరెతో ఉరి వేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

సారపాక, జనవరి 28: పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తిరుమలాచారి ఆదివారం తెలిపారు. పట్టభద్రులు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినా మళ్లీ ఫ్రెష్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సిందేనన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు ఎమ్మెల్సీ ఓటుకు అర్హులని, మీసేవా ద్వారా లేదా తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి

సారపాక, జనవరి 28: బూర్గంపహాడ్ మండలంలో అధికారిక ఇసుక ర్యాంపులు ప్రారంభించి అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు చుక్కపల్లి బాలాజీ ఆదివారం ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో వేలమంది అసంఘటిత కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ప్రభుత్వం గుర్తించి అధికారిక ఇసుక ర్యాంపును ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

కట్టమైసమ్మ ఆలయానికి వితరణ

అశ్వారావుపేట రూరల్, జనవరి 28 : మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులో ఉన్న శ్రీకట్టమైసమ్మ ఆలయం వద్ద బోరు నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కంచర్ల ప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, గ్రామపెద్దలు చిన్నంశెట్టి వెంకట నర్సింహారావు, నులకాని శ్రీనివాసరావు, చందా లక్ష్మీనర్సయ్య, ఆకుల శ్రీనివాస్, చందా రామారావు పాల్గొన్నారు.

'ఉద్యోగ విభాగం బలోపేతానికి కృషిచేస్తా'

చండ్రుగొండ, జనవరి 28 : మున్నూరుకాపు సంఘం ఉద్యోగ విభాగం బలోపేతానికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర ఉద్యోగవిభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ లంకా నర్సింహారావు అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

'ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి మార్షల్ ఆర్ట్స్ దోహదం'

కొత్తగూడెం అర్బన్, జనవరి 28: ఆత్మరక్షణకు, ఆరోగ్యవంతమైన జీవితానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి 2024 రిపబ్లిక్ కప్ ఓపెన్ కరాటే క్రీడాపోటీలను పట్టణంలోని ఉర్దూఘర్‌లో ఇంద్రాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఈ ప్రాంతానికి పేరుప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు.

పెద్దమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పాల్వంచ రూరల్, జనవరి 28: మండలంలోని కేపీ - జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అక్కడ సందడి వాతావరణం ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలుస్వీకరించారు. కొందరు భక్తులు బాలలకు తలనీలాలు తీయించుకున్నారు. మరికొందరు భక్తులు అన్నప్రాసన వేడుకలు, వాహన పూజలు జరిపించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఈవో రజనీకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'సమాజానికి ఆదర్శం.. వెంకటయ్య కుటుంబం..'

సంతాపం తెలిపి మొక్కలను పంపిణీ చేస్తున్న ప్రముఖులు

కొత్తగూడెం టౌన్, జనవరి 28: సమాజ శ్రేయస్సు కోసం నిత్యం పరితపిస్తూ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్న మొక్కల వెంకటయ్య కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, పీసీసీ మెంబర్ జేబీ శౌరి, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల మొక్కల వెంకటయ్యకు పుత్రవియోగం జరిగినందున ఆదివారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని రాయి నగేశ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకటయ కుటుంబం శోకసంద్రంలో ఉన్నప్పటికీ కుమారుడి జ్ఞాపకార్థం అతడి సంస్మరణ కార్యక్రమం సందర్భంగా మొక్కలను అందించడం అభినందనీయమని అన్నారు. వైద్యులు ఉపేందర్‌రావు, కృష్ణ చైతన్య, ఇరుకు బాబూరావు, రామనాథం, డీపీఆర్‌వో శీలం శ్రీనివాస్, ప్రముఖ కవి బెల్లం సామేలు, జేమ్స్ ఎడ్విన్, లగడపాటి రమేశ్, కరిష రత్నకుమారి, నరసింహారావు పాల్గొన్నారు.

బీఎస్పీ పినపాక అధ్యక్షుడిగా మల్లికార్జునరావు

మణుగూరుటౌన్, జనవరి 28: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)పినపాక అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా పీక మల్లికార్జునరావును నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి నల్లగట్ల రఘు, జిల్లా అధ్యక్షుడు నడిపింటి మధు ఆదివారం తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పాకా వెంకటేశ్వర్లు, బూర్గుల కరుణాకర్, సతీష్‌యాదవ్, రాంబాబు, నీరజ్, ప్రణయ్, రాజు పాల్గొన్నారు.